కంకర పోసి..బీటీ మరిచారు

- నరకప్రాయంగా పాంనూర్, నమిలిగొండ రోడ్డు
- రెండున్నరేళ్లు గడిచినా పూర్తికాని పనులు





కంకర పోసి వదిలేసిన పాంనూర్–నమిలిగొండ రోడ్డు (ఇన్‌సెట్‌లో) మాజీ ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసిన శిలాఫలకం

స్టేషన్‌ఘన్‌పూర్ : రవాణా కష్టాలు తీర్చాల్సిన రోడ్డు ప్రజలు, ప్రయాణికులకు నరకం చూపిస్తోంది.. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను మధ్యలోనే వదిలేశాడు.. అధికారులు, పాలకుల పర్యవేక్షణ లేకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని పాంనూర్ గ్రామం నుంచి నమిలిగొండకు వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఈ రోడ్డు వెంట వెళ్లే ప్రజలు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం రోడ్డు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కంకర పోసి చేతులు దులుపుకున్నారని, ఇంతవరకూ బీటీ వేయలేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పాంనూర్ నుంచి నమిలిగొండకు వెళ్లే రోడ్డు మట్టి రోడ్డుగా ఉండేది. ఏళ్లతరబడి రెండు గ్రామాల ప్రజల కోరిక మేరకు ఎట్టకేలకు ఎల్‌ఆర్‌ఎస్ నుంచి నిధులు మంజూరయ్యాయి.దీంతో పాంనూర్ నుంచి నమిలిగొండ వరకు దాదాపు మూడు కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.46 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2021 జూన్ 26, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బీటీ రోడ్డు నిర్మాణ పనులను శంఖుస్థాపన చేశారు. ఇక బీటీ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని, తమ కష్టాలు తీరుతాయని ప్రజలు సంతోషించారు. కానీ ఎక్కడి పనులు అక్కడే మిగిలి ఉన్నాయి.

నత్తనడకన నిర్మాణ పనులు

అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం ఆరు నెలల్లో పూర్తి కావాల్సిన పనులు రెండున్నరేళ్లు గడిచినా ఇంతవరకూ పూర్తి కాలేదు. కేవలం రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. దాదాపు ఏడాదికి పైగా ఈ పనులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంతవరకూ బీటీ వేయకపోవడంతో కంకరరోడ్డుపై ప్రయాణంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నీలిమ ఆస్పత్రిలో పేషెంట్ల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ : నిత్యం నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నీలిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ నియోజక వర్గ పేషెంట్లను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఒకొక్కరి వద్దకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఈ సందర్భంగా పేషెంట్లు ఎమ్మెల్యే ఔదార్యానికి రుణపడి ఉంటామని చెప్పారు. తమ ప్రాణాలు కాపాడిన ఎమ్మెల్యేను ఎప్పటికీ మరువబోమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నీలిమ ఆస్పత్రిలో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యసేవలు అందిస్తామన్న మాటను నిలబెట్టుకోవడం జరుగుతుందన్నారు. సామాజిక సేవతో పాటు జనగామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సాగునీటిని విడుదల చేస్తున్న నాయకులు

చిల్పూరు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ సమీపంలో మబ్బుగుట్ట వద్ద యాసంగి పంటలకు సాగునీటిని అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు శుక్రవారం దేవాదుల పైప్‌లైన్ నుంచి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యాసంగి పంటకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాల్వల ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో దేవాదుల పైప్ లైన్ నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు యశ్వంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, బుచ్చిరెడ్డి, మామిడాల యాదవరెడ్డి, పుట్ట కిరణ్‌రెడ్డి, కాసాని బొందయ్య, గుర్రం యాదగిరి, నగరబోయిన శ్రీరాములు, లవన్‌కుమార్, తౌటి సునీల్, శోభ, శ్రీనివాస్, మల్లారెడ్డి, బాలరాజు, లక్ష్మణ్, రాజన్న, విజయ్, వెంకటాచలం, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న వెంకటేశ్వరశర్మ

కొడకండ్ల : మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్వాములు, భక్తుల భజనలతో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.40 లక్షలు భక్తులు, స్వాములు విరాళంగా ప్రకటించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు పాలకుర్తి సుధాకరగౌతంశర్మ, కొడకండ్ల, ఏడునూతుల, తొర్రూరు, దేవరుప్పుల ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కరాటేతోనే ఆత్మరక్షణ



కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్

కొడకండ్ల : బాలికల ఆత్మరక్షణకు కరాటే అవసరమని జీసీడీఓ గౌసియాబేగం అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెడ్‌స్టార్ కుంగ్‌ఫూ కరాటే అకాడమీ మాస్టర్స్ బానోత్ బాబుకుమార్, రాణిలక్ష్మిబాయి కరాటే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలికలకు శిక్షణ ఇస్తున్నామని, కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఓ పేరం శారద, పీఈటీ అలీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించేందుకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీఓతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభకు హాజరయ్యారు. అయితే ముందుగా సభ్యులు జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి మృతికి సంతాపంగా కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ కందుల రేఖగట్టయ్య తెలిపారు. వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, వెంకటస్వామి, లతాశంకర్, గండి విజయలక్ష్మి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జఫర్‌గఢ్ : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు(శనివారం) సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరు, ప్రజా సమస్యలపై చర్చిస్తారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపేందర్ తదితరులు

దేవరుప్పుల : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు ఎం. లక్ష్మణ్‌జీ డిమాండ్ చేశారు. మండలంలోని కామారెడ్డి గూడెం హైస్కూల్‌లో శుక్రవారం టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల నోడల్ అధికారి సీహెచ్.ఉపేందర్ తదితరులు ఆవిష్కరించారు. ప్రభుత్వం మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్ రుణాలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, మండల ప్రధాన కార్యదర్శి జోగు వరప్రసాద్‌రావు, జిల్లా నాయకులు బి.వెంకన్న, ఎం.ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు సోమేశ్వర్, నవీన్, రాజేందర్, జ్యోతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘కొమ్మూరి’కి క్షమాపణ చెప్పాలి

బచ్చన్నపేట : మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీపీఎం నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చల్లా ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేగా నర్మెట మండలంలో ఎస్టీ హాస్టల్ నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చారని అన్నారు. అలాగే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను నియోజక వర్గానికి తీసుకురావడానికి తన సొంత ఖర్చులతో ఎస్టిమేట్ వేయించి అధికారులను ఒప్పించి రిజర్వాయర్‌ను నిర్మించిన ఘనత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిది అని పేర్కొన్నారు. త్వరలోనే కొమ్మూరికి ఎమ్మెల్సీ పదవి వరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

‘ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు’



పాలకుర్తి: దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు



బచ్చన్నపేట: తమ్మడపల్లిలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఓబులాపూర్‌లో..



జనగామ: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున తదితరులు

పాలకుర్తి : అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరవుతాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపురంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కల్పించడం వంటి కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ శ్రీను, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, ముస్కు శ్రీను, బత్తిని సురేష్, సోమ శ్రీకాంత్, నాసం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

జనగామ : జనగామ పట్టణంలో శుక్రవారం 15, 16, 19, 26వ వార్డులో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీ స్కీంలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఆయా వార్డుల్లో బీఆర్‌ఎస్ మీడియా ఇన్‌చార్జ్ ఆర్.రాజ్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య శిబిరాల వద్దకు వెళ్లి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. 26వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి రంగరాజు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీ స్కీంలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు మినుకూరి మహేందర్ రెడ్డి, చెంచారపు కరుణాకర్ రెడ్డి, పొన్నాల జగత్ కుమార్, వేమల్ల సురేష్ రెడ్డి, బండవరం నరేష్, అంగన్ వాడీ టీచర్ గర్దాసు స్వరూప, ఆర్పీ వాణి తదితరులు ఉన్నారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి

దేవరుప్పుల : అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి కె.రాము పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మాపురం పరిధి లక్ష్మణ్ తండా, సీత్య తండా, రామరాజుపల్లి, నీర్మాలలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగ్యారంటీల పథకం కోసం ప్రజల దరఖాస్తులను పారదర్శకంగా డాటా ఎంట్రీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.సురేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, స్నేహ, జలంధర్‌రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి, నారాయణపురం గ్రామాల్లో తహసీల్దార్ విశాలాక్షి, పడమటికేశ్వాపూర్, సాల్వాపూర్ గ్రామాల్లో ఎంపీడీఓ రఘురామకృష్ణ శుక్రవారం ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు అనుగుణంగా కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలకు ముందస్తుగానే దరఖాస్తు పత్రాలు అందించడంతో వాటిని పూర్తి చేసి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లను జతచేసి అధికారులకు అందజేశారు. దరఖాస్తు దారులు ఒక్కసారిగా ఎగబడకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి అందరిని వరుసగా క్యూలో పంపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మేకల కవితరాజు, గిద్దెల రమేష్, మాసపేట రవీందర్‌రెడ్డి, కీసర లక్ష్మిబాగులు, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, స్పెషలాఫీసర్లు ఇస్మాయిల్, కృష్ణ, ఎంపీటీసీలు గూడెపు లతశ్రీతిరుపతి, గుర్రాల లలిత, పంచాయితీ కార్యదర్శులు దేవీప్రసాద్, భాను, అనిల్, సౌజన్య పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘ప్రజాపాలన’

జఫర్‌గఢ్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రఘునాథ్‌పల్లి, ఓబులాపూర్, మగ్దుంతండా గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సభలో ప్రజల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సర్పంచ్‌లు బొమ్మినేని శ్రీదేవి, నీరాజారెడ్డి, బానోత్ లక్ష్మితో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ షురూ..

దేవరుప్పుల : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ విభాగం సెల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం తలపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ శుక్రవారం సాయంత్రం మొదలయింది. ఈ విషయమై ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. మండలంలో స్వీకరించిన దరఖాస్తులను ఒక్కొక్క ఆపరేటర్ రోజుకు యాభై చొప్పున నమోదు చేసేందుకు పదహారు మంది చొప్పున రెండు షిఫ్టుల్లో చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కాగా ఈ డాటా ఎంట్రీని పాలకుర్తి నియోజకవర్గ పరిశీలకుడు, డీపీఓ రంగాచారీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారులు హుస్సేన్, కె.రాము, స్థానిక తహసీల్దార్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీఓ టి.సురేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు కృపాకర్‌రెడ్డి, మల్లీశ్వర్ తదితరులు ఉన్నారు.


వినతి-అభినందనలు

మంత్రి సురేఖను కలిసిన రమేశ్‌గౌడ్



పాలకుర్తి టౌన్ : రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం గౌడజన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి నలమాస రమేశ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఆయన హైదరాబాద్‌లో సురేఖను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి



లింగాలఘణపురం : మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి సమస్యలను విన్నవించారు. అదేవిధంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దూసరి గణపతి, కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు స్వరూపరాణిభూపాల్‌రెడ్డి, సత్యనారాయణ, రాజు, కృష్ణ, నాయకులు కాటం కుమారస్వామి, పూర్ణచందర్, సురేందర్‌రెడ్డి, నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, మల్లేశం, రాజు, యాదగిరి, వెంకటేశ్, నర్సింహ్మా, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యశస్వినిని కలిసిన ‘కొమ్మూరి’



పాలకుర్తి టౌన్ : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డితో పాటు యశస్విని రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ నెల 8న తొర్రూరు మండలం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక రాక విషయాన్ని వారు చర్చించారు.

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ని కలిసిన రాజిరెడ్డి



జనగామ : తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ దీపాదాస్ మున్షీని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి శుక్రవారం కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేష్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్ : ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి క్రీడా ప్రాంగణం వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.8 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, గ్రామంలో దాదాపు అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అందరూ గ్రామ అభ్యున్నతికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ, వార్డు సభ్యులు కొలిపాక వేణు, కొంగరి మధు, బీఆర్‌ఎస్ నాయకులు కనకం గణేష్, గుండె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. భర్తకు రిమాండ్

బచ్చన్నపేట : మద్యం తాగి భార్యపై దాడిచేసిన భర్తను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కంకల సతీష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన దండుగుల నరేష్ తాగుడుకు బానిసై అతని భార్య లక్ష్మిని కొట్టేవాడు. అలాగే శారీరక చిత్రహింసలకు సైతం గురి చేసేవాడు. ఈక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో దాచిన డబ్బులు కనిపించడం లేదని లక్ష్మి, భర్త నరేష్‌ను అడిగింది. కోపంతో రగిలి పోయిన నరేష్ లక్ష్మిని తిడుతూ ఆమెను చంపాలనే ఉద్దేశంతో ఇంట్లో ఉన్న కత్తిపీటతో భార్యపై దాడి చేయబోయాడు. చేతులు అడ్డు పెట్టడంతో ఆమెకు బలమైన గాయమై రక్త స్రావమైంది. దీంతో లక్ష్మి కేకలు వేయగా ఇరుగు పొరుగు వారు వచ్చి నరేష్‌ను అడ్డుకుని, ఆమెను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నరేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



ధ్వంసం చేసిన మత్తడి

చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట సమీపంలో గల చింతలచెరువు మత్తడిని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేయడంతో సాగునీరు వృథాగా పోతోంది. గార్లగడ్డతండా సమీపంలోని మల్లన్నగండి మత్తడి నుంచి వచ్చే నీరు కృష్ణాజీగూడెం చెరువు నిండి అక్కడి నుంచి పల్లగుట్ట చెరువులోకి చేరుతాయి. కాగా ఈచెరువు నిండడంతో రైతుల పొలాలు నీటితో నిండి ఉంటాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు మత్తడిని ధ్వంసం చేసి ఉంటారని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరారు.

రాములోరి అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం అయోధ్య రామజన్మ భూమి పూజిత అక్షింతలను గడప గడపకు పంపిణీ చేశారు. అర్చకులు చొల్లేటి రాజేశ్వరశర్మ వేద మంత్రోచ్చరణలతో పూజలు చేశారు. ట్రస్టు సభ్యులు తోకల సంపత్‌రెడ్డి, నామాల రాహుల్, సంపత్‌రెడ్డి, పోలేపల్లి వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, జగన్నాథం, మాదిరెడ్డి మోహన్ రెడ్డి, మాదంశెట్టి తార, కరుణ పాల్గొన్నారు.

బాల్యమిత్రుల చేయూత



దేవరుప్పుల : మండలకేంద్రానికి చెందిన చింత ఇస్తారి–రేణుకల కుమార్తె శ్రీవాణి వివాహానికి దేవరుప్పుల హైస్కూల్‌లో 1993–94 బ్యాచ్ పదోతరగతి చదివిన బాల్యమిత్రులు పుస్తెమట్టెలతో పాటు బీరువాను కానుక ఇచ్చి చేయూతనిచ్చారు. ఈ కార్యక్రమంలో బుక్క శ్రీధర్, గుంటిపల్లి యాకయ్య, యామ సంతోష్, తీగల శ్రీనివాస్, కోనేటి లక్ష్మయ్య, బుర్ర పద్మ, స్వర్ణలత, తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు వేర్వేరుగా ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న చందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన గాదె కొత్తవెంకటస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ గాదె చంద్రయ్య, నాయకులు కంసాని రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



చెల్మయ్య (ఫైల్)

కొడకండ్ల : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనంతోజు చెల్మయ్య శుక్రవారం మృతి చెందాడు. చెల్మయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే మృతి చెందాడు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, స్థానిక నాయకులు మనోహర్, రమేష్, వెంకన్న తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లొడంగి కర్రయ్య భార్య కొమురమ్మ శుక్రవారం మృతి చెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొమురమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ధర్మారెడ్డి, ఉప్పలయ్య, రమేష్, ప్రకాశ్, అనిల్, వెంకన్న, ఎల్లయ్య, రవి, తదితరులు ఉన్నారు.